అమ్మ

శ్రీమతి భాగవతుల బుచ్చమ్మ

'అమ్మా, అమ్మా' యనిపిల్చాడు అనంతం పరిగెత్తుకొనివచ్చి. తోముతూవున్న పళ్లెమునువిడిచి పెట్టి 'ఏలనాయనా? ఇంతవేగంగా వెళ్లిపోవచ్చినావేమిటి? యివాళస్కూలుకు సెలవాయేమిటి?' అంది భారతి విస్మితురాలయి.

'కాదే అమ్మా, గురువుగారు నాలుగణాలు తెచ్చుకోమన్నారు.'

'ఎందుకు తండ్రీ?'

'అమ్మా నీకేమి తెలియదే. రేపు గణపతి పూజకదూ! రెండణాలు ప్రసాదానికి, రెండుఅణాలు గురువుగారి దక్షిణకు.'

'నాలుగణాలు యెక్కడనుండి తేగలను నాయనా?'

'బాగుందే, తోడి పిల్లలంతా యిస్తూవుంటే నేనెలా యివ్వకుండా వుండను? రామేశం రెండు రూపాయిలిచ్చినాడే.'

'వాడు లక్షాధికారి బిడ్డడు. మనము చాలా బీదవాళ్లము. పైసాయెక్కడనుండి వస్తుందిమనకు?'

'దక్షిణయివ్వనివాళ్లను పూజకురానివ్వనని గురువుగారు చెప్పినారు.'

'సరే, రేపుకదా పూజ. సాయంత్రములోపుగా రెండణాలు చూస్తానులే.'

'అయితే మరిప్రసాదానికో?'

'ఇవ్వకపోతే మానివేయని. నీవునునేనుకలసి యింటిలోపూజచేసుకొని తిందాము.' అంది భారతి బుజ్జగిస్తూ.

'అక్కడయితే పకోడీలు, లడ్డుండలు, జిలేబీలు యింకా యెన్నెన్నియో దొరుకును. నీతో అయితే పూజచేసిన పిదప పప్పూ అన్నం తప్ప మరేమియునుండదు.' అని అనంతం చిన్నమొగము వేసు కొన్నాడు.

భారతికి నలుదిశలు యంధకారమయముగా గోచరించినది. పాపం పరిస్థితి యటువంటిది. ఎట్టి కష్టములను గట్టెక్కుచు యెటుల యెనిమిది వత్సరములు గడపినదో యాభగవంతునికయినను తెలియదు. అనంతం జన్మించిన కొద్దినెలలపిదప భార్యాభర్తలకేదో పట్టింపుమాటవచ్చినది. ఆమఱుచటి యుదయమునకే గోపాలం యంతర్ధానమయినాడు. పన్నెండు, ఒంటిగంటవరకు అన్నము మూతబెట్టి భర్తకోసము కనిపెట్టు కొని కూర్చుంది. ఇప్పటికిరాలేదు, అప్పటికిరాలేదు గోపాలం. ఎక్కడకుపోయినాడో తెలియదు. ఇక నేముంది? ఇంటిలో యెవరికీ భోజనాలులేవు. భారతి నెత్తీ వాయికొట్టుకొంది. ఎవరితో చెప్పి యేడు స్తుంది? వానిని వెదకే దాతయెవరు? సాయంత్రం అయినది. వానిజాడలేదు. బయట ఘోరమని వర్షము కురియుచుండెను. ఇంటిలో భారతికన్నీటివర్షం. ఆమెజీవనాధారం ఆతడే. ముష్టియోనష్టియో యెత్తి నాలుగుడబ్బులు సంపాదించెడువాడు. ఏవిచారములేకుండా యామె కూర్చుండెడిది. కానియిప్పుడో?

ఇంటిలో యేముంది? నాలుగుడబ్బులు సంపాదించుటెటులు? నాలుగు అణాలు అంటే నాలుగు లక్షలవలె కనబడుతుంది. కాని చిన్నబోయిన పిల్లవాని ముఖమునుజూచి యామె సహించలేక పోయింది. ఓదార్చి మీద యాశఁబెట్టుకొని కుమారునకు మాటయిచ్చింది. భరింపరాని తల్లియావేదన శిశువు అనంతమునకు యేమి తెలియును? పాపం, యేమి తెలుసుకొనగలడు? ఇంతలో స్వాధ్యాయులు, 'ఒరే అనంతం, వేగమురారా' యని కేకలువేసినారు.

'వస్తున్నాను, ఉండండి. అమ్మా, వేగము డబ్బియ్యవే. వాళ్ళందరు వెళ్లిపోవుచున్నారు' అనంతం తొందరపడుచూ యనెను.

భారతి యుపేంద్రుని బిల్చి 'అబ్బాయీ, నావద్ద యిప్పుడొక చిల్లిగవ్వయైనను లేదు. రేపు పూజవేళకు యే తాపత్రయముపడియైనా సొమ్ము పంపెదనని మీ గురువుగారితో చెప్పుమ'ని యంది.

బాలురంతా వెళ్లిపోయారు. చాలా దినములనుండి యింకిపోయిన దుఃఖాశ్రువులు మరల భారతి నేత్రములనుండి స్రవింపసాగెను. ఎక్కడనుండి పైకముఁదెచ్చి కుమారుని యవమానముఁ దప్పించగలదు? గురువుగారికి దయాదాక్షిణ్యములుండవా? వానిమాట నాలకింపరా? గురువుగారా గ్రామస్థుడయిన ఆమె వాని కాళ్ళమీద పడవలసినదే. కాని పరాయివాఁడు. పాపం, యింటిలో నొకమూలఁగూర్చుండి యేడ్చుటకయినను యామెకు వ్యవధిలేదు. గుండె రాయిజేసుకొని గ్రామములోనికి బయలుదేరింది యేమయినా యాధారముగాని, యే మహానుభావుని దయగాని ప్రాప్తించునేమోయని.

♦ ♦ ♦ ♦

భారతి గ్రామమంతా వేటాడింది. ఒకడు బట్టలు కుట్టించెదనని యాశబెట్టాడు. మరొకడు యామెచేతనే ధాన్యము దంపించెదనని వాగ్దానమిచ్చాడు. కాని యామెకొక చిల్లిగవ్వయినా దొరకలేదు. కడసారి యాశ యొకనిపైఁబెట్టుకొనినది. అతను గ్రామమునకు రెండుమైళ్లదూరములో వున్నాడు. ఆయన తప్పక యిచ్చునన్న యాశపెట్టుకొంది. ఆమెకాళ్లీడ్చుకొనుచు యామహానుభావుని యింటికి బోయింది. ఆయన నాలుగయిదు దినములక్రిందట తన కుమార్తె యింటికిఁబోయియున్నాడు. రిక్తహస్తములతో భారతియింటికి బోవలసివచ్చింది. ఆమెగుండెలు దడదడ కొట్టుకొనసాగెను. కాలము వ్యర్థమయి పోతూంది. త్వరగా గృహమునకుపోవనిచో అనంతం ఆమెకొరకు వేచియుండును. ఎంతయాశపెట్టుకొని నిరీక్షించుచుండునో పాపం? వెళ్లిన తోడనే పైసా కొరకుగెంతులువేయును. ఏమిబోధపర్చివానిని యోదార్చగలదు? గర్భదరిద్రులన్నసంగతి వాని కెటుల తెలియును?

అనుకొన్న ప్రకారము యక్షరములా జరిగింది. తల్లిని చూచినతోడనే అనంతం పరుగు పరుగున వచ్చి చీరకొంగుపట్టుకొని 'అమ్మా! డబ్బు తెచ్చావా? ఏదీ?' అన్నాడు.

'పదనాయనా రేపుకదాపూజ. రేపు తప్పకయిస్తానులే.' యనినచ్చచెప్పింది.

ఝామురాత్రినుండి పనిచేసింది. ఆఖరకు ఆమెకు దొరికింది శేరుబియ్యము మాత్రమే.

ఉదయము యెనిమిదిగంటలలయింది. పిల్లకాయలంతా పువ్వులు గోయుటకు బయలుదేరారు. కొందరు చెఱువునకుపరుగెత్తారు. ఆదినమున వారియానందమునకు మేరలేదు.

తోడి పిల్లకాయలమధ్య యెంతసేపో అనంతం యుండలేకపోయాడు. పైసాకొరకు పరుగుపరుగున యింటికివచ్చాడు. పైసా యివ్వకుండ యేముఖము పెట్టుకొని వారివద్దకు బోగలడు?

కుఱ్ఱవాళ్లంతా జట్టుజట్టులుగా మంచిమంచివస్త్రములను ధరించి గణపతిపూజకు వెడుతూ,

'ఒరే అనంతం! పూజకు రావురా?' యని కేకేశారు.

'ఆగండి, మా అమ్మవస్తుంది'

కడసారి ప్రయత్నమునుగూడచేసి భారతి యింటికివచ్చింది.

'అమ్మా, వేగం పైసా యియ్యవే. అందరు వెళ్లిపోతున్నారు' అన్నాడు అనంతం.

భారతికండ్లనుండి జలజలమని నీరుకారింది. పైకి కనబడకుండా చీరకొంగుతో కండ్లుతుడుచుకొని 'నాయనా, చాలప్రయత్నముచేశాను. ఒక్కదమ్మిడీ అయినాదొరికిందికాదు. ప్రసాదముకొరకు కావలసిన రెండుఅణాలు తెచ్చేందుకు ప్రసాదరావును బంపితిని.

'అయితె గురువుగారి దక్షిణమాటయేమి?'

'శేరుబియ్యము తీసుకొనివెళ్లుము'

'గురువుగారు డబ్బుతీసికొనిరమ్మన్నారు. బియ్యమేమి చేసుకొంటారు?'

'గురువుగారు మాత్రము డబ్బుయిచ్చేగదా బియ్యముకొనాలి? శేరుబియ్యముఖరీదు రెండు అణాలు. శేరుబియ్యమే యిచ్చేయి.'

బాలుడు యెట్టకేలకుసమ్మతించెను. కాని మనస్సులో ప్రాణము కొట్టుకొనిపోతుంది. అందరు యిచ్చింది డబ్బులు తానుయిచ్చేది బియ్యము. మానావమానాలుమరచి అనంతం పూజచేయుటకు పరుగు పరుగునవెళ్లాడు.

బియ్యముతోనున్న పళ్లెమునుజూచి గురువుగారుమండిపడిరి. పళ్లెమును దూరముగావిసరివైచి 'నేనేమి ముష్టిముండాకొడుకు ననుకొంటివా? ముష్టివేయుటకు పిడికెడు బియ్యముపట్టుకొనివచ్చితివి. ఈబియ్యమునకు నిన్ను పూజచేయనిస్తా ననుకొంటివికాబోలు? ఫో అవతలకు' యనికేకలు వేశారు.

అనంతం నిలువున నీరయి పోయి సిగ్గుచే తలవంచుకొని యొక మూల నిలబడినాడు 'అమ్మకు నామీద యిసుమంత ప్రేమయైనాలేదు. లేకపోయిన రెండు అణాలు యివ్వలేదాయేమి?' యని యనుకొన్నాడు. పిల్లవాళ్లు గుంపులు గుంపులుగా వచ్చి గణపతికి పూజ చేస్తున్నారు. అనంతం హృదయములో ప్రచండ వేదన జ్వాలలు ప్రజ్వరిల్లసాగాయి. బాలుర యొకరి తర్వాత నొకరు గణపతి మీద పూలుచల్లు తూంటే, పాపం! అనంతమునుమాత్రం పూజకు రానిచ్చుటలేదు. ఏమిచేస్తాడు? కిటికీ గజములను బట్టు కొని సిద్ధిగణాధిపతిని విలోకిస్తూ నిల్చున్నాడు. ఇంతలో నొక ధనవంతుని బిడ్డడు రమేశం పరుగెత్తుకొని వస్తూవుంటే వాని తల అనంతంతల డీకొన్నవి. రమేశం మొర్రోమని యేడువసాగాడు—గురువుగారికి కోపము అగ్గిమీద గుగ్గిలమయింది. పూజ విడిచిబెట్టి బెత్తంపట్టుకొనివచ్చి 'ఏమయిం'దని రమేశును యడిగాడు. 'అనంతం బుర్రతోగుద్దివేశాడండీ'యని యేడుస్తూ చెప్పాడు రమేశం.

పాపం అనంతం యెక్కడికి పోగలడు? రెండణాలు చెల్లించుకొన్నప్పటికి పూజచేయుటకు స్థానము లభించుటలేదు. గురువుగారు రోష కషాయిత నేత్రులై 'చూస్తే గుంట వెధవవు, చేసేపనులు పందికొక్కు చేష్టలు. ఏమిరా నీకుపోయేకాలం? వానిని బుర్రతో యెందుకు గుద్దితివని బలమైన దెబ్బలుకొట్టి అక్కడ నుండి వానిని తరిమివేశారు.

♦ ♦ ♦ ♦

అనంతం శరీరమంతయు కంపింపసాగెను. తల్లి యొడిలోబడెను. భారతి అనంతం బుగ్గలను ముద్దులాడి చిబుకమునుబట్టుకొని 'ఏమి జరిగింది నాయనా'యంది

'నాలుగణాలు' యనిగద్గద కంఠముతో అన్నాడు.

'ఉండిన యివ్వకపోదునా? పూజచేశావుగదా, ప్రసాదము మనము చేసుకొని తిందాం'

'పూజ మాత్రమెక్కడ జేసితిని? పట్టుకొని వెళ్లిన బియ్యమును విసరివైచి గురువుగారునన్ను పూజామందిరమునుండి గెంటేశారు. బైటనేయుండి పూజ చూస్తుంటినని జరిగినదంతయుచెప్పి ఏడ్చాడు.

'పోనీ, విఘ్నేశ్వరుని విగ్రహము చేశాను. దా, యిద్దరము కలసి పూజ చేసుకొందాం'

'వద్దమ్మా, పూజ చేయలేను. మంచమువేయి పండుకోవలెనని ఉంది.

మంచమువాల్చింది. అంత చొక్కావిప్ప సరికి భారతి కండ్లు టపటపమని నీరుకార్చినాయి. వీపు మీద దెబ్బలనుజూచి భరించలేకపోయింది. తన జీవనాధారమగు యేకైక పుత్రుని వీపుపైని యింతటి కఠోర మగుదెబ్బలా! పిల్లవాడు నల్లగామాడి పోయినాడు. దుఃఖితురాలు, నిస్సహాయురాలగు భారతి యేమిచేయు గలదు? సాయంత్ర మగుసరికి అనంతంకు తీవ్రమయిన జ్వరముతగిలింది. నీలి మేఘములు తండోప తండములుగా వచ్చి నభమును గ్రమ్మి వేసినాయి. తాండవ నృత్యము ప్రారంభమయింది. ఉరుములు, మెరుపులతో వర్షము కురియసాగాయి. అట్టి సమయమున ఆ దరిద్ర కుటీరమునకు వచ్చెడి వారెవరు? సొమ్మెక్కడనుండి వచ్చును? రాత్రి యంధ కార బంధురంబయి యుండింది. అనంతం ఒకటే పలువరింపు 'కొట్టకండీ గురువుగారు, మా అమ్మను డబ్బు అడిగి తెస్తాను. రమేశాన్ని నే నేమి చేయలేదండి. మా యిద్దరి బుర్రలు గుద్దుకొన్నాయి కాని'

పలవరింపులు లావయిపోయింది. పాపం భారతి దేముళ్లకు మ్రొక్కుకుంది. అనేక విధాలుగా వేడుకుంది. కుమారుని కొరకు ప్రాణములను సైతము ధారపోయుటకు సంసిద్ధురాలు అయింది. కాని యీమె యరణ్య రోదనం ఆలకించు వారెవరు? మూడుదినములు గడచింది. అనంతం కొన యూపిరినికూడ విడచిపెట్టాడు. భారతి కండ్లనుండి యిప్పుడొక నీటి బొట్టుకూడ పడుటలేదు. వెర్రిదానివలె చూస్తూ కూర్చుంది. సెలవు పుచ్చుకొని కాలేజీనుండి తొందరగా వచ్చుచున్న ప్రమదంచూచి యీమె నోదార్చి దహన సంస్కారమున కాయత్తు జేశాడు. భారతి కూర్చున్న చోటు కదలలేదు. నోటంట మాటలేదు.

శవమును శ్మశాన వాటికకు తీసుకొనిపోయి రెండుగంటలయింది. ఇంతలో తపాలా బంట్రోతు వచ్చి "అనంతంబాబూ, అనంతంబాబూ" యని కేకవేశాడు.

ప్రమదం బయిటకు వచ్చి చూచెను. అనంతంకు నాలుగువందలు రూపాయిల మనియార్డరువచ్చింది. భారతి వద్దకువెళ్లి 'పిన్నీ, నీ వేలుముద్ర కావాలి' అన్నాడు.

భారతి జీర్ణహృదయములో నాలోచించుట కేమియు శక్తిలేదు. ప్రమదం చెప్పిన ప్రకారము వ్రేలుముద్ర వేసింది. టంగు టంగుమని నాలుగువందల రూపాయలను వాయించి లెఖ్ఖబెడుతూ యున్నప్పుడు ప్రమదం మనస్సు డోలాయమానమయింది.

'ఎవరికీ నాయనా రూపాయలు?' అడిగింది భారతి.

'నీకేను, పిన్నీ! రంగంనుండి వచ్చినవి'

'ఇన్ని రూపాయిలు నాకు పంపించే దాత యెవరు?'

'గోపాలం రంగంలో నొక మహారాజువద్ద యుద్యోగం చేసినాడట. ఆయన పంపించినాడు.'

అనునయ వాక్యములచే నోదార్చి ప్రమదం యింటికి వెళ్లిపోయాడు. భారతి రూపాయిలను కొంగున మూటగట్టుకొని శ్మశానవాటికకు పరుగెత్తింది. చితి పూర్తిగా కాలిపోయింది. వేడిబూడిద మాత్ర ముంది. ఆ వెచ్చని బూడిదపై భారతి రూపాయిలను బోసి 'ఒరే నాయనా, అనంతం, నీవు నాలు గణాలకొరకు ప్రాధేయ పడనక్కరలేదు. నాలుగువందల రూపాయిలు మీ నాన్నగారు పంపించినారు. లే, నాయనా, ఇవిగో రూపాయి'లంటూ యెలుగెత్తి యేడువసాగింది.

ఎవరువస్తారు? ఎవరువింటారు?— ఆమె ఘోష......

(హిందీనుండి)

గొంతెమకోరికలు

పద్మరాగాలతో జిగిలు బోలుపారు;
తళతళలతో కనుల మిఱుమిట్టుగొలుపు;
పట్టుకన్నను మేలు పుట్టంబుగట్టు;
ఆరుద్రపురువల్లె నేనుండరాదే!

కనురెప్పపాటులో కడలెల్లగడిచి;
కనులకందనిచోట్ల గన్గొనివచ్చి;
సృష్టికతీతమా సృష్టిరచించు;
కవిమనోవేగంబు నాకబ్బదేలో!

సరసరాగాలతో, కులుకుచును నడుచు;
గాంధర్వగానాల, లోకాలదనుపు;
మఱచిపోయినకలల, మనసులో నిలుపు;
మలయమారుతమల్లె, నే మెలగలేనే!
కోయిలకుగానంబు, గఱపగాలేనే!!

—ధరణికోట శ్రీరాం.